తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక వార్త



# ఎమ్మెల్యే గారూ.. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపండి

- నియోజకవర్గ ప్రజల వినతి



కోట, జూన్ 7 ప్రభాతవార్త : గూడూరు నియోజకవర్గాన్ని ముందుగా నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలని నియోజకవర్గ ప్రజలు నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలో గూడూరు నియోజకవర్గం నెల్లూరు జిల్లాలో ఉండేది. వైసీపీ ఒక్కొక్క పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా మార్చడంతో గూడూరు నియోజకవర్గం కూడా తిరుపతి జిల్లాలో కలిసింది. దీంతో నియోజకవర్గ ప్రజలు ఏదైనా మండల స్థాయిలో అధికారుల వద్ద పరిష్కారం కాని సమయంలో ఆ సమస్యను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ వద్దకు వెళ్లి వినతిపత్రం ఇవ్వాల్సి వచ్చేది. ఆ క్రమంలో 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతో వ్యయప్రయాసలతో అంత దూరం వెళ్ల లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షంలో ఉండిన పాశం సునీల్‌కుమార్ ప్రజల కష్టాలు తెలుసుకొని.. అధికారంలోకి రాగానే ముందుగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ఎన్నికల సమయంలో నిర్వహించిన రోడ్డుషోలలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో ఇదే సమస్యను ఆయన చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో పాశం సునీల్‌కుమార్‌కు బాగా ఓట్లు వేశారని వాదన లేకపోలేదు. ఆ తర్వాత ప్రజాగళం పేరిట నారా లోకేష్ గూడూరు నియోజకవర్గ పర్యటన సందర్భంగా ఇదే అంశాన్ని కోటలో జరిగిన సభలో కూడా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఇటీవల గూడూరుకు వచ్చిన చంద్రబాబునాయుడు కూడా అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చిన విషయాన్ని ప్రజలు గుర్తు చేస్తున్నారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపడంపై కొత్త ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జోక్యం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# అదృష్టం ఎవరికో!?

## -మంత్రి పదవులపై తెలుగు తమ్ముళ్ళలో జోరు చర్చ



తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త: సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లాతో బాటు తిరుపతి జిల్లాలోని నియోజకవర్గాల్లో అనూహ్యంగా గెలుపొందిన టిడిపి ఎమ్మెల్యేల్లో ఎవరిని మంత్రిపదవులు వరిస్తాయనే చర్చ తెలుగుతమ్ముళ్ళలో హాట్‌గా మారింది. టిడిపి అధినేత, ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడు సొంత జిల్లాకూడా కావడంతో ఇక్కడ మంత్రి పదవులకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది. అంతేగాక ఈ సారి మారిన చంద్రబాబును చూస్తారని, గెలిపించిన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలనే బలమైన సూచనను ఇప్పటికే బాబు ఎమ్మెల్యేలకు సూచించారు. అంతేగాక ప్రజలతో అనుబంధం ఉన్న వారికి మంత్రి పదవి కట్టబెడితే అటు ప్రభుత్వానికి ఇటు పార్టీకి నష్టం ఉండదనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో చిత్తూరు జిల్లానుండి కుప్పంలో చంద్రబాబునాయుడుతో సహా ఐదుమంది ఎమ్మెల్యేలు, తిరుపతి జిల్లాలో ఏడుమంది ఎమ్మెల్యేలు (తిరుపతిలో జనసేన మినహాయించి)మిగిలిన వారంతా టిడిపి ఎమ్మెల్యేలే. వీరిలో పలమనేరు ఎమ్మెల్యే ఎన్,అమరనాథరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇద్దరే సీనియర్ నేతలు. గతంలో మంత్రి పదవుల్లో పనిచేసిన అనుభవం ఉంది. కొత్తగా ఎన్నికైన వారిలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, పూతలపట్టు డాక్టర్ మురళీమోహన్, జిడి నెల్లూరు డాక్టర్ థామస్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ కొత్తవారు, తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు మంత్రి పదవి దక్కకపోవచ్చనేది సమాచారం. ఆయనకు టిటిడి బోర్డులో ప్రాతినిథ్యం కల్పించే అవకాశం ఉంది. కొందరు పార్టీ మారివచ్చిన వారు ఉన్నారు. కొత్తవారికి ఈ సారి మంత్రి పదవులు రాకపోవచ్చని తెలుగుదేశం సీనియర్ నేతలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వీరిలో కొంత ఉన్నతచదువులు ఉన్న పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌కు, కుల ప్రాతిపదికన మంత్రి పదవి దక్కే అవకాశం లేకపోలేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. తిరుపతి జిల్లాలో ఎవరికి మంత్రి పదవి వరిస్తుందో కూడా బేరీజు వేయలేకపోతున్నారు. దీంతో 12వతేదీ ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణస్వీకారం చేసిన తరువాత మంత్రి పదవులు ప్రకటించే అవకాశంఉంది. ఇప్పుడే సొంత జిల్లాలో పలువురు ఆశావహులు తమ అదృష్టం పరీక్షించుకునేందుకు, తమతమ పనితీరును వెల్లడించేందుకు సిద్ధమయ్యారు. మరీ వీరిలో ఎవరికీ అమాత్యపదవి వరిస్తుందనేది మాత్రం మరో వారంరోజులు వేచిచూడాల్సిందే.

# ఐదేళ్లలో ఏ ఏ పనులు చేసారో... వివరాలివ్వండి!

## ఇంజనీరింగ్ శాఖలో గుబులు

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తులు అభివృద్ధికి అందించిన నిధులను ఐదేళ్ళలో ఏ ఏ పనులకు? ఎలా వెచ్చించారో? వివరాలి వ్వాలని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి సంబంధిత ఇఓను కోరారు. శ్రీకాళహస్తీశ్వ రాలయ ఇఓగా ఉన్న ఎస్ వి నాగేశ్వరరావు ఈ నెలాఖరుకు ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఆయన హయాంలో గతంలో ఏ ఏడాది వెచ్చించనంత నిధులను వెచ్చించారు. సుమారు రూ.4కోట్లుకు పైగా వెచ్చించారు. బడ్జెట్ లేదు, జమాఖర్చుల లెక్కల్లేదు, గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఆడిట్ అభ్యంతరాలు చోటు చేసుకున్నాయి. ఆడిట్ అధికారులను కూడా ఫోన్ కాలతో బెదిరింపులు. ఇలా సాగింది. ప్రభుత్వం మారింది. ఇక్కడి ప్రజా ప్రతినిధి మారారు. లెక్కమారింది. అక్రమార్కు గుండెల్లో రైళ్ళు పరుగులు తీస్తున్నాయి. శాసనసభ్యుడుగా బొజ్జల సుదీర్‌రెడ్డి డిక్లేరేషన్ తీసుకున్న వెంటనే శ్రీకాళహస్తీశ్వ రాలయం నుంచే సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో ఐదేళ్ళ పాటు, ఈ ఏడాది శివరాత్రికి చేసిన ఖర్చులేమిటి, ఇక్కడ ఏ పనులు చేపట్టారు? ఆ పనులు ఏ విధానంలో చేపట్టారు, పనులు ఎవరు చేసారు, అంచనా ఎంత, టెండర్ ఎంత, చెల్లింపులు ఎంత? అనే వివరాలను ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. అయితే శ్రీకాళహస్తీశ్వరా లయంలోని ఇంజనీరింగ్‌శాఖలో కొందరు బినామీలు అవతారమెత్తారు. వారే కాంట్రాక్టర్ల పేరుతో పనులు చేసి తలాకొంచెం తిలాపాపం అన్నట్లు పంచుకున్నారు. అలాంటి పనులకు సంబంధించి ఇప్పుడు ఇంజనీరింగ్ శాఖలో గుబులు మొదలైంది. మాస్టర్‌ప్లాన్‌ను పక్కన పెట్టి ఇతర పనులకు ఎందుకు ప్రాధాన్యత ఇచ్చారు? శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదేళ్ళుగా ప్రతిష్టాత్మకమైన మాస్టర్ ప్లాన్‌ను పక్కన పెట్టి, పరిశీలనల పేరుతో కాలయాపన చేస్తూ భక్తులు సమర్పించిన నిధులు కోట్లు ఎందుకు ఇతర పనులకు వెచ్చించారు? ఈ పనులతో నిధులన్నీ హారతి కర్పూరంలా కరిగిపోయాయి? కదా? అదే మాస్టర్ ప్లాన్ మీద వెచ్చించి ఉంటే ఆలయ రూపురేఖలు మారిపోయేవి కదా? అని సుధీర్‌రెడ్డి ప్రశ్నించినట్లు రాజకీయ చర్చ జరుగుతుంది. మరి ఇంజనీరింగ్ అధికారులు శాసనసభ్యునికి ఏమి వివరాలు ఇస్తారో వేచి చూడాలి! తిమ్మిని బొమ్మి చేసే సామర్థత కల్గిన అధికారులున్నారు. మరి మసిపూసిన మారేడులా నివేదికలిస్తారో? ఏమో చూడాలి.



# ద్రవిడ వర్సిటీని చంద్రబాబు సెంట్రల్ వర్సిటీగా మార్చుతాం

## - తెదేపా రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు-వైకాపా పాలనలో కులాలు..దోపిడీలకు నిలయం -తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు అందేలా చర్యలు !!



కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త : వైకాపా పాలనలో నిర్వీర్యం అయిన ద్రవిడ వర్సిటీని కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సెంట్రల్ వర్సిటీగా మార్చుతారని తెదేపా రాష్ట్ర కార్యదర్శి డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం వర్సిటీలోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ వెంకటేష్, గోపీనాథ్, క్లస్టర్ ఇన్‌చార్జ్ లు సత్యేంద్రశేఖర్, ప్రతాప్, జనసేన డా॥ నరేష్ తదితరులతో కలసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. పదకొండు నెలలుగా వేతనాలు అందని తాత్కాలిక ఉద్యోగులకు చంద్రబాబునాయుడు సిఎంగా బాధ్యతలు చేపట్టాక వేతనాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ డా॥కంచర్ల శ్రీకాంత్, ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం లతో పాటు తాను వర్సిటీలో నెలకొన్న సమస్యలను అధినేత దృష్టికి తప్పక తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతినెలా 1వతేది వేతనాలు అందేలా కృషి చేస్తామన్నారు. అర్హత కలిగిన వారికి ప్రమోషన్లు పొందని వారికి న్యాయం చేస్తామన్నారు. వర్సిటీలో హార్టీకల్చర్, అగ్రికల్చర్, వెటర్నరీ, ఇంజనీరింగ్ కోర్సులు చంద్రబాబు తీసుకు వస్తారన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రతి సమస్య పరిష్కరించేలా తెలుగుదేశం పార్టీ తరపున తాము కృషి చేస్తామన్నారు. ద్రవిడ వర్సిటీని వైకాపా పాలనలో కులాలకు నిలయంగా, దోపిడీలకు కేంద్రంగా చేశారన్నారు. వేతనాలు లేకుండా తాత్కాలిక ఉద్యోగులు అల్లాడుతుంటే సిఎం, మంత్రి, ఎమ్మెల్సీలు నెల జీతం కూడా వారికి ఇవ్వకుండా పాలించారంటే వర్సిటీని ఎంత నిర్వీర్యం చేశారో అర్థమవుతుందన్నారు. అవసరమైన వారికి దొడ్డిదారిన ప్రమోషన్లు కల్పించారన్నారు. వేతనాలు వర్సిటీని మూసివేయాలని వైకాపా ప్రభుత్వం కుట్రలు చేసిందన్నారు. త్రిబుల్ ఇంజన్ సర్కారుతో కుప్పాన్ని అన్ని విధాలా చంద్రబాబునాయుడు అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో నేతలు హేమాంబర గౌడు, అమీర్, జయరాం, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయంలో అంతర్గత బదలీలు

## రాజకీయ సెక్యూరిటికి స్వస్తి-జోరుగా సంస్కరణలు అమలు



శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిపాలన మారింది. గతంలో పరిపాలించిన వారు యువకులు వెళ్ళి ఉపాధి, ఉద్యోగం అంటే దేవాలయానికి వెళ్ళు నాలుగు రూపాయలు సంపాదించుకో అంటూ వరమిచ్చారు. దాంతో ఆలయంలో రాజకీయ నాయకుల సిఫార్సులతో అనధికారికంగా దళారులు తయారయ్యారు. కొందరు ఉద్యోగులు తమ ఇష్టారాజ్యంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారించారు. అయితే పరిపాలన మారింది, రాజకీయంగా ఇక్కడ తిష్టవేసిన వారికి కష్టాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 4న ఓట్ల లెక్కింపులో గెలుపొందిన శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయంలో అధికారులు, ద్వితీయశ్రేణి అధికారులతో సమన్వయ, పరిచయ సమావేశం ఏర్పాటు చేసి తన లక్ష్యమేమిటో తన విధానాలేమిటో స్పష్టం చేసారు. ఆలయానికి దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి భద్రత, మరో సారి రావాలనే భావం కలగాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆయనసూచనల మేరకు ఆలయకార్యనిర్వహాణాధికారి ఎస్‌వి నాగేశ్వరరావు వెంటనే అమలు చేసారు. అంతర్గత బదిలీలు చేసారు.

**బదిలీల వివరాలు ఇలా ఉన్నాయి:**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో పరిపాలన సంస్కరణలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కొందరు అధికారులకు స్థాన భ్రమసం కల్గింది. డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డికి మాస్టర్‌ప్లాన్, మీడియా పాయింట్, మింట్ అన్నదానం, జనరల్ స్థానాలను అప్పగించారు. గతంలో ఆయనకు ఎలాంటి పరిపాలనా బాధ్యతలను ఇవ్వకుండా వ్యవహారించారు. పి.లోకేష్‌రెడ్డి ఎఇఓకు ప్రదాన ఆలయం, డిసిబిలను అప్పగించారు. గతంలో ఈ శాఖలను ఎకె ధనపాల్ పర్యవేక్షించే వారు. ఎకే.ధనపాల్‌ను సమీక్షలుశాసనసభ్యుడు సూచించినట్లు గోశాలకు బదలి చేసారు. సీనియర్ అసిస్టెంట్ పి.రాజశేఖర్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్ బాధ్యతలను అప్పగించారు. కె.ప్రదీప్‌రెడ్డిని ఇఓ సిసిగా నియమించారు. సి.అన్వేష్ జూనియర్ అసిస్టెంట్‌ను లీగల్, భూములు, స్కిట్, నర్సింగ్ పాఠశాల బాధ్యతలను అప్పగించారు. కె.మహేష్‌ను మళ్ళీ క్యాషియర్‌గా నియమించారు. కాంటాక్టు ఉద్యోగి సి.హరికృష్ణను పబ్లికేషన్ స్టాల్ బాధ్యతలను అప్పగించారు. ఏ.అనిల్‌బాబు వాచ్ అండ్ వార్డుగా నియమించారు. సిహెచ్ మయూర్ కుమార్ అసిస్టెంట్ స్టేషనరి వింగ్‌కు బదిలి చేసారు. వై.సుధీర్‌ను సమాచారం రైల్వేస్టేషన్, మైక్ అనౌన్స్ మెంట్‌కు బదిలి చేసారు. ఎన్ కె కిరణ్ కుమార్‌రెడ్డిని విఐపి లాంచ్‌కు బదిలి చేసారు. అయితే ఇంకా కొందరికి స్థాన చలనం కల్గే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

# అంతర్జాతీయ స్థాయి విద్యా బోధన

## -ఘనంగా శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల 63వ వార్షికోత్సవ వేడుకలు




తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త : శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల తిరుపతి 63వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ కె. సాంబశివరావు అధ్యక్షతన పశువైద్య కళాశాల ఆడిటోరియంలో జరిగిన శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వార్షికోత్సవ వేడుకలకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి. కరుణాసాగర్, హైదరాబాద్ కెనరా బ్యాంక్ జోనల్ మేనేజర్, వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థి బి.చంద్రశేఖర్, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు డాక్టర్ పివి సత్యగోపాల్, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి. రమణ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. వార్షికోత్సవం సందర్భంగా గత ఏడాది కాలంగా శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలలో జరిగిన అభివృద్ధి, విద్యార్థులు, అధ్యాపకులు సాధించిన విజయాలను గురించి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి. ప్రభాకర్ రెడ్డి ప్రగతి నివేదిక సమర్పించారు. ఈ సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ డినాఫ్ అగ్రికల్చర్ డాక్టర్ జి. కరుణాసాగర్ మాట్లాడుతూ ఆచార్య రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలతో విద్యా బోధన చేస్తున్నదని, నాణ్యమైన వ్యవసాయ విద్యను అందించడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ బి. చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విద్యను అభ్యసించిన విద్యార్థులకు రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయని, సాయంతో పాటు బ్యాంకింగ్, భీమా రంగాలలో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని, సివిల్స్, గ్రూప్స్ లక్ష్యంగా విద్యార్థులు ప్రయత్నించాలన్నారు. పూర్వ విద్యార్థులు పలువురు ఐఏఎస్, ఐపీఎస్ లాంటి ఉన్నత స్థాయి సేవా రంగాల్లో రాణిస్తూ ఉండడం మనకు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థిగా ఎంతో గర్వపడుతున్నామని, తన ఉన్నతిలో శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల పాత్ర మరువలేని దన్నారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అభివృద్ధి కోసం తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు డాక్టర్ పివి సత్యగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ విద్యకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ ఉందని, వ్యవసాయ విద్యను అభ్యసించిన విద్యార్థులు ఉద్యోగ ఉపాధి రంగాల్లో రాణిస్తున్నారన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ విద్యార్థులు భవిష్యత్తును నిర్ణయించుకోవాలని ఆయన సూచించారు. తిరుపతి ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.రమణ మాట్లాడుతూ రైతుల క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ విద్యార్థులు సిద్ధంగా ఉండాలని కోరారు. శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వార్షికోత్సవ సందర్భంగా కళాశాల విద్యార్థుల వివిధ సాంస్కృతిక, సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ప్రత్యేక సాంస్కృతిక, వ్యాసరచన, క్రీడా పోటీల విజేతలకు అతిధుల చేతల మీదుగా బహుమతులు అందజేసారు.

# జూన్ 17 నుంచి అప్పలాయగుంటలో బ్రహ్మోత్సవాలు



వడమాలపేట, జూన్ 7 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. జూన్ 25 వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించడానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మే 11న కోయల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. 17న ధ్వజారోవహణంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు రాత్రి పెద్దశేష వాహన సేవ జరుగుతుందని, 18న ఉదయం చిన్న శేష వాహనం, రాత్రి హంస వాహనం, 19న సింహ వాహనం, ముత్యపు పందిరి వాహన సేవలు, 20న కల్పవృక్ష సర్వభూపాల వాహన సేవలు, 21న మోహినీ అవతారం, గరుడ సేవ, 22న హనుమంత, గజవాహన సేవలు, 23న సూర్యప్రభ, చంద్రప్రభ, 24న రథోత్సవం, సాయంత్రం అశ్వ వాహనం, 25న చక్రస్నానం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో ఉదయం 8 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయని తెలిపారు. అలాగే 20 తేదీ సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించ నున్నారు. ఈ కల్యాణోత్సవంలో పాల్గొన్నదలచిన భక్తులు 500 రూపాయలు ముందుగా చెల్లించి పేర్లనమోదు చేసుకోవచ్చునని ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజు ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు, కోలాటాలు నిర్వహించనున్నారు.

## కుప్పం కంచుకోటలో...

# బాబుపై చెక్కుచెదరని అభిమానం

## - పెరిగిన మెజారిటీ.. పనిచేసిన పార్టీ సంస్థాగత ప్రక్షాళన !



కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త : తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత నియోజకవర్గం కుప్పంలో తెలుగుదేశం అధినేత, కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై ప్రజల్లో ఉన్న అభిమానం చెక్కుచెదరలేదు. ఇందుకు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే సాక్ష్యంగా నిలుస్తాయి. వైకాపా శ్రేణులు ఎన్నికల్లో గెలుపుకోసం కుప్పంలో కోట్ల రూపాయల నోట్ల కట్టలు జనంపై వెదజల్లినా జనం ఏమాత్రం ఖాతరు చేయక చంద్రబాబుకు గతంలో కంటే మెజార్టీని పెంచి విజయం అందించారు. గత ఎన్నికల్లో చంద్రబాబునాయుడుకు 30722ఓట్లు మెజార్టీ రాగా 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 48343 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధి ంచిన విషయం విదితమే. 2019 ఎన్నికలతో పోల్చితే 18వేలకు పైగా మెజార్టీ పెరగడం విశేషం. 2019లో వైకాపా అధికారంలో వచ్చాక 2021లో పంచాయతీ, పరిషత్ ఎన్నికలు జరిగాయి. అయితే ఈ ఎన్నికలను తెలుగుదేశం పార్టీ బహిష్కరించడంతో కుప్పంలో వైకాపా అధిక స్థానాలు సాధించింది. పలుచోట్ల తెదేపా అభ్యర్థులు ప్రచారాలు చేయకున్నా విజయంసాధించారు. అదే ఏడాది కుప్పం మున్సిపల్ ఎన్నికలు సైతం జరిగాయి. ఈ ఎన్నికల్లో వైకాపా ప్రభుత్వం కోట్లరూపాయలను మంచినీళ్లప్రాయంగా ఖర్చు చేసి తెదేపా శ్రేణులను భయభ్రాంతులకు గురి చేసి కేసులతో భయపెట్టి పలువురిని లాక్ చేసింది. దీంతో ఈ ఎన్నికల్లో వైకాపా గెలిచింది. ఈ ఫలితాలపై తెదేపా అధినేత చంద్రబాబునాయుడు సైతం అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే కుప్పం ఎప్పుడూ తన కంచుకోటేనని నిరూపించాలని అందుకు చేపట్టాల్సిన చర్యలపై చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ప్రధాన ంగా పార్టీలో 'ప్రక్షాళన' చేయాలని నిర్ణయించారు. నియోజకవర్గంలో ఉన్న పార్టీ మండల అధ్యక్ష పదవులను యువతకు కట్టబెట్టారు. పార్టీలో ఉన్న సీనియర్లు యువ నాయకులకు తగు సలహాలు సూచనలు అందించాలని యువతను తాను ప్రోత్సహిస్తానని చంద్రబాబు కరాఖండిగా చెప్పేశారు. యువతకు పార్టీలో తగు ప్రాధాన్యత ఇస్తూ వచ్చారు. ప్రధానంగా వైకాపా ప్రభుత్వ వైఫల్యాలు బలంగా ప్రజల్లో తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను సంసిద్ధులు చేశారు.

**ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం పార్టీ పగ్గాలు :**

కుప్పం తెలుగుదేశం పార్టీలో కొనసాగిన పాత ఒరవడికి చెక్‌పెడుతూ తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు పార్టీలో ఎవరూ ఊహించని రీతిలో చంద్రబాబునాయుడు సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2023లో జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసిన డా॥ క ంచర్ల శ్రీకాంత్ రికార్డుస్థాయిలో అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్లపై పూర్తి విశ్వాసంతో కుప్పం తెలుగుదేశం పార్టీ పగ్గాలను చంద్రబాబు అప్పగించారు. అధినేత తనపై ఉంచిన నమ్మకాన్ని కొనసాగిస్తూ ఎమ్మెల్సీ డా॥ కంచర్ల కుప్పం నియోజకవర్గంలో అందర్నీ కలుపుకుని పార్టీని ముందుకు నడిపించారు. పార్టీలో నేతల మధ్య ఉన్న బేధాభిప్రాయాలు పక్కన పెట్టాలని, పార్టీ కోసం కష్టించేవారికి తప్పక గుర్తింపు లభిస్తుందని భరోసా కల్పిస్తూ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా డా॥ కంచర్ల పార్టీలో తనదైన శైలిలో మార్పులు తీసుకువచ్చారు. మరో పక్క పార్టీ కార్యకర్తలు ఎదుర్కొన్న కేసులు, వారి సమస్యలు ఎప్పటికప్పుడు అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తూ చంద్రబాబు ఆదేశాలతో కార్యకర్తల్లో ధైర్యం నించారు. కుప్పంలోనే నివాసం ఉండి నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ కార్యక్రమాలను, వైకాపా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి నేతలు, కార్యకర్తలు విస్తృతంగా తీసుకెళ్లేలా పనిచేశారు. నేతలు, కార్యకర్తలు అధినేత చంద్రబాబునాయుడు కోసం పనిచేసేలా పార్టీలో మార్పులు తెచ్చారు. మరో పక్క కాబోయే సిఎం చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరమ్మ సూచనలు స్వీకరిస్తూ కుప్పంలో అధినేత చంద్రబాబునాయుడుకు మెజార్టీ పెంపుకు విశేష కృషి చేశారు. ఏది ఏమైనా తెదేపా అధినేత చంద్రబాబునాయుడు కుప్పం తెలుగుదేశం పార్టీలో చేపట్టిన సంస్థాగత ప్రక్షాళన మంచి ఫలితాన్ని ఇవ్వడంతో పాటు మరలా రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సిఎంగా బాధ్యతలు చేపట్టనుండడంతో పార్టీ కార్యకర్తలు ఆనందభరితులవుతున్నారు.

## జనావాసాల్లో వచ్చిన కొండ చిలువ

–పట్టుకున్న అటవీ సిబ్బంది

కుప్పంరూరల్, జూన్ 7 ప్రభాతవార్త :



మండలంలోని గరిగచీనేపల్లి పంచాయతీ వేపనపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం ఓ కొండ చిలువ హల్‌చల్ చేసింది. గ్రామంలో ఉన్న ఇళ్ల మధ్యకు చేరిన కొండ చిలువ రెండు మూడు కోళ్లను లాగించేసింది. అనంతరం కొంత సమీపంలో ఉన్న మేకలపై పడేందుకు సిద్ధమవుతుండగా స్థానికులు గుర్తించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది హుటాహుటిన గ్రామానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని సమీప అటవీ ప్రాంతంలో వదిలి పెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

## నీట్‌లో మెడిసిన్ సీట్లు సాధించిన కెజెసి విద్యార్థులు



కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త : కుప్పం జూనియర్ కాలేజ్‌లో చదివిన ముగ్గురు విద్యార్థులు నీట్ 2024 పరీక్షల్లో రాణించి మెడిసిన్ సీట్లు సాధించినట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్, ఛైర్‌పర్సన్ శాంత నాగరాజ్ తెలిపారు. నిఖిల్ శ్రీనివాసన్ అనే విద్యార్థి 605/720మార్కులు, అలాగే ర ంజిత్ 557/720 మార్కులు, శంకర్ 550/720మార్కులతో మెడిసిన్ సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

## ద్రవిడ వర్సిటీలో పరిశోధనలకు రూసాచే 11లక్షలు మంజూరు

గుడుపల్లె, జూన్ 7 ప్రభాతవార్త :



ద్రవిడ వర్సిటీలో మూడు పరిశోధన ప్రాజెక్టుల కోసం రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష అభియాన్ (రూసా) 11లక్షల గ్రాంట్‌ను మంజూరు చేసింది. అందులో భాగంగా మొదటి విడతలో 4.84లక్షలు విడుదల చేశారన్నారు. ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ రాజే ంద్రప్రసాద్ 5లక్షల పరిశోధన గ్రాంట్ పొందారు. అలాగే కన్నడ భాష, అనువాద అధ్యయనాల ప్రొఫెసర్ శారద, తెలుగు భాష మరియు అధ్యయనాల ప్రొఫెసర్ శ్రీదేవిలకు చెరో మూడు లక్షల వంతున మంజూరు చేశారు. వర్సిటీ అధ్యాపకులకు రూసా ద్వారా గ్రాంట్ మంజూరు కావడం పట్ల వర్సిటీ ఉపకులపతి ఆచార్య మధుజ్యోతి, ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది హర్షం తెలిపారు.

## రోడ్లపై నిలుస్తున్న వర్షపునీటితో జనం అవస్థలు

శాంతిపురం, జూన్ 7 ప్రభాతవార్త :



మండలంలోని పంచాయతీ కేంద్రమైన కెనమాకులపల్లిలో వర్షపు నీరు రోడ్డుపై నిలుస్తుండడంతో జనం అవస్థలు పడుతున్నారు. కెనమాకులపల్లి–కొత్తూరు మార్గంలో వర్షపు నీరు రోడ్డు మధ్యలో ఉన్న గుంతల్లో నిండిపోయింది. రోడ్డుకు ఇరువైపులా పొలాలు కలిగిన రైతులు మట్టిని ఎక్కువ ఎత్తులో వేయడంతో ఈపరిస్థితి నెలకొంది. పంచాయతీ అధికారులు స్పందించాల్సి ఉంది.

## జ్యోతిధ్యాన శిక్షణా తరగతులు

చిత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:

చిత్తూరు పట్టణం, గిరింపేటలోని శ్రీ సత్యసాయిసేవా సమితి నందు ఆధ్మాత్మిక విభాగం ఆద్వర్యంలో ఈనెల 9వ తేది ఆదివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు నామసంకీర్తన, జ్యోతిధ్యాన శిక్షణా శిబిరంను నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు మధుసూదనం తెలిపారు. ఈ సదవకాశాన్ని జిల్లాలోని ప్రతి భజన మండలి, సమితి సభ్యులు, కన్వీనర్లు, ఆధ్యాత్మిక సమన్వయకర్తలు, బాలవికాస్ గురువులు, విద్యార్థులు, భక్తులు, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హామీ ఇచ్చారు..ఆదుకోండి

–చల్లాబాబుకు షికారిల మొర

పుంగనూరు, జూన్ 7 ప్రభాతవార్త:



తమ గ్రామం నుంచి వ్యవసాయపొలాలకు వెళ్ళేందుకు ఉన్న దారులు మూసేశారని,తమను ఆదుకోవాలని షికారిపాలెంకు చెందిన ప్రజలు తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లాబాబుకు విజ్ఞప్తిచేశారు. ఎన్నికల సమయంలో గ్రామానికి వచ్చిన చల్లాబాబుకు అంకయ్య అధ్వర్యంలో ప్రజలు తమ సమస్యలు వివరించారు. తమ గ్రామానికి అనుసంధానంగా ఉన్న పొలాలకు వెళ్ళడానికి ఉన్న దారిని మూసివేసి,ఆదారిలో నీటిని మళ్ళించారని ఆరోపించారు. కాలువ నీటి ద్వార నిత్యం పొలాల వద్దకు వెళ్ళిరావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని షికారీపాలెం ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పండిన టమోటా పంటను కాలువ ద్వారా తీసుకురావడంతో పాటూ చుట్టుదారిని వెళ్ళాల్సి వస్తున్నదని, తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని,ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం నెరవేర్చాలని కోరుతున్నారు.

## డిగ్రీ కోర్సులకు దరఖాస్తు చేయండి

పుంగనూరు, జూన్ 7 ప్రభాతవార్త:

స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులకు దరఖాస్తుచేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. కళాశాలలో బిఏ,బికాం,సిఏ,విఎస్సీ కోర్సులలో ప్రవేశం కల్పిస్తున్నారు. విద్యార్థులు వృధా ప్రయాసలతో ప్రైవేట్ విద్యాసంస్థలలో చేరే ప్రయత్నాలు చేయవద్దని,అది చాలా ఇబ్బందులు కల్పిస్తుందన్నారు. తమ కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సులతో పాటూ మంచి అనుభవం కలిగిన అధ్యాపకులు,గ్రంధాలయం అందుబాటులో ఉందన్నారు.

## నీట్‌లో మెడిసిన్ ర్యాంకు సాధించిన ఐఆర్‌ఎం విద్యార్థిని జీవన

కుప్పం, జూన్ 7 ప్రభాతవార్త :




స్థానిక ఐఆర్‌ఎం కాలేజ్‌లో 2023లో బైపిసి కోర్సు చదివిన విద్యార్థిని జీవన ఈ ఏడాది నిర్వహించిన నీట్ 2024 పరీక్షల్లో 583/720మార్కులతో మెడికల్ సీటు సాధించినట్లు కాలేజ్ ఛైర్మన్ బిఎం దయానిధి తెలిపారు. ఈసదర్భంగా జీవనను ఘనంగా సత్కరించారు. గుడుపల్లె మండలంకు చెందిన సోమయ్య, పుష్పల కుమార్తె అయిన జీవన ఇంటర్‌లో సైతం 985మార్కులు సాధించిందన్నారు. కాలేజ్ సిఇఒ మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ కుప్పంలో తొలిసారిగా ఐఆర్‌ఎం కాలేజ్‌లో ఐఐటి, నీట్ ప్రవేశ పరీక్షలకు గాను నెల్లూరు, తిరుపతి, బెంగళూరు, వైజాగ్ నుంచి అనుభవజ్ఞులైన అధ్యాపకులను రప్పించి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## లోక సుభిక్షం కోసం రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), జూన్ 7 ప్రభాతవార్త :



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో లోక సుభిక్షం కోసం రాహుకాలాభిషేకాన్ని నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. ఇఒ చంద్రమౌళి, అధికారులు, అర్చక, సిబ్బంది భక్తులకు వసతులు సమకూర్చారు.

## వైష్ణవీదేవీ పాహిమాం...!

పుదిపట్ల(చౌడేపల్లి), జూన్ 7 ప్రభాతవార్త :



మండలంలోని పంచాయతీ కేంద్రం స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో సాంప్రదాయ బద్ధంగా పూజలు జరిగాయి. ఉదయాన్నే మహిళా అర్చకురాలు శ్రావణిచే అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. ఆలయం ప్రాంగణంలోని నాగభైరవుడు, ఆంజనేయస్వామి వార్లను భక్తులు దర్శించుకొన్నారు. భక్తులకు ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## ప్రజలు మూడోసారి మోదికి... ప్రధాని పట్టం కట్టారు

– జిల్లా భాజపా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు

చిత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



ప్రధాని నరేంద్రమోడి చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలతో ప్రజలు మూడోసారి ప్రధానిగా మోదికి తిరిగి పట్టం కట్టారని జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రధాని తిరిగి ప్రధాని కావడంతో ఆనందోత్సవాల నడుమ పటాసులను పేల్చి సంబరాలు చేసుకొన్నారు. ఎన్డీయే కూటమిపై ప్రతిపక్ష నేతలు ఎంత బురదచల్లే ప్రయత్నం చేసిన నరేంద్రమోడి చేసిన అభివృద్ధి పనులే ఆయనను తిరిగి ప్రధానమంత్రిని చేసిందని ఆనందం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో భాజపా నాయకులు వెంకటేశ్వర చౌదరి, దుర్గారామక్రిష్ణ, అట్లూరిశ్రీనివాసులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వేసవి తాపం తీరుస్తున్న నైరుతి వర్షం

తడ, జూన్ 7 ప్రభాతవార్త :



తడ మండలంలో నిన్నటి దాకా రోహిణి కార్తె ప్రభావంతో తీవ్రమైన ఎండలతో ఇబ్బంది పడిన జనం ప్రస్తుతం నైరుతి రుతుపవనాల రాకతో వాతావరణం చల్లబడి హాయిగా ఉన్నారు. గత రెండు మూడు రోజులుగా అడపదడపా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. తడ బజారులో పలుచోట్ల బురద నీళ్ల మడుగులు కట్టాయి. ఈ వర్షంతో అక్కడక్కడా పంట పొలాల్లో కూడా నీళ్ల చేరాయి.

## వైసీపీ వీరవిధేయుల గుండెల్లో గుబులు

– ప్రభుత్వం మారడంతో ఆందోళన

కోట, జూన్ 7 ప్రభాతవార్త :

ఐదేళ్ల వైసీపీ పాలనలో గూడూరు డివిజన్‌లో కొందరు అధికారులు రెచ్చిపోయారు. ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటున్నామన్న ఆలోచనే లేకుండా ప్రవర్తించారు. నిబంధనలను తుంగలో తొక్కి పాలకపక్షం ఏది చెబితే అదే చేశారు. అధికార పార్టీ అండ చూసుకొని రెచ్చిపోయారు. వైసీపీ నాయకుల కబ్జాలు, అవినీతి, ప్రకృతి వనరుల దోపిడికి పూర్తి సహకారం అందించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇబ్బందులు పెట్టారు. సార్వత్రిక ఎన్నికల్లో అధికార వైసీపీ ఓటమి చెందడంతో ఆ పార్టీకి వీర విధేయులైన అధికారుల్లో ఆందోళన మొదలైంది. కొత్త ప్రభుత్వం విచారణ జరిపిస్తే తమ పరిస్థితి ఏమిటన్న భయం వారిలో నెలకొంది. ఒక దశలో డివిజన్ స్థాయి అధికారే వైసీపీ టికెట్‌ను ఆశించి భంగపడినట్లు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## ఎన్నికల కోడ్ ఎత్తివేత

– యధావిధిగా కార్యకలాపాలు

కోట, జూన్ 7 ప్రభాతవార్త :

గత కొన్నిరోజులుగా కొనసాగుతున్న ఎన్నికల కోడ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. ఉపసంహరణ ఉత్తర్వులు గురువారం సాయంత్రం నుంచి అమల్లోకి వచ్చాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ మార్చి 16న వెలువడినప్పటి నుంచి ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఈసీ నిబంధనల ప్రకారం సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన అన్ని ప్రక్రియలు పూర్తి కావడంతో నియమావళి ముగుస్తూ ఈసీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో జిల్లాలో సైతం ఎన్నికల కోడ్‌ను ఎత్తివేశారు. ఎన్నికల నేపథ్యంలో నగదు తరలింపుతో సహా పలు అంశాలపై ఆంక్షలు విధించారు. ఈసారి ఎన్నికల నియమావళి ఉన్న సమయంలో నాయకుల విగ్రహాలకు ముసుగులు తొలగించారు.

## చంద్రబాబు నాయుడుని కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ



వెంకటగిరి టౌన్, జూన్ 7, ప్రభాతవార్త :

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కురుగొండ్ల రామకృష్ణ కలిశారు. సిఎంగా మూడోసారి ప్రమాణస్వీకారం చంద్రబాబు నాయుడు చేస్తున్న సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కురుగొండ్ల మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సందర్భంగా చంద్రబాబు నాయుడు కూడా ఆయనను అభినందించారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కూడా ఎమ్మెల్యే రామకృష్ణ కలిసి అభినందన తెలిపారు. కాగా నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డిలను కూడా కలిసి అభినందనలు తెలిపారు. పలు అంశాలపై చర్చించారు.

# గూడూరు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

–గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్



గూడూరు, జూన్ 7 ప్రభాతవార్త :

20 వేలకు పైగా మెజారిటీతో గూడూరు నియోజకవర్గ ప్రజలు నన్ను ఎమ్మెల్యేగా గెలిపించినందుకు వారికి రుణపడి ఉంటానని నియోజకవర్గంలోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని పార్టీ గెలుపుకు కృషి చేసిన టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలకు గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో సునీల్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు నా పై ఎంతో నమ్మకంతో ఎమ్మెల్యేగా గెలిపించారని వారి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. మేము ఎవరిపై కక్ష సాధింపు చర్యలు చేయమని అలాగే టిడిపి కార్యకర్తలు జోలికి వస్తే వదలమని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన అవినీతిని వెలికి తీస్తామని అధికారులు న్యాయబద్ధంగా విధులు నిర్వహించాలని సూచించారు. మున్సి పాలిటీ, నియోజకవర్గంలోని మండలాల్లో సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరి స్తామని అధికారంలోకి వచ్చామని తెలిపారు. వైసిపి నుండి స్వార్థపరులైన నాయకులు టిడిపి పార్టీలోకి వస్తే వారిని చేరనివ్వమని అన్నారు. విజయానికి కృషి చేసిన టిడిపి, బిజేపి, జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, లీలావతి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, బిల్లు చెంచురామయ్య, శివకుమార్, వెంకటేశ్వర రెడ్డి, అల్లూరు కరుణాకర్ రెడ్డి, పిట్టి నాగరాజు, మట్టం శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయం రూ.30,17,383

చిల్లకూరు, జూన్ 7, ప్రభాతవార్త



చిల్లకూరు మండలంలో తూర్పు కనుపూరు గ్రామంలో వెలసి వున్న శ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు శుక్రవారం నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో రెండు నెలలకు గాను 30,17,383 రూపాయిలు వచ్చినట్లు ఛైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనా రెడ్డి రెడ్డి, ఆయన ఇఒ నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్, శ్రీనివాస్ బాబు, ధర్మకర్త మండలి సభ్యులు దువ్వూరు చంద్రశేఖర్ రెడ్డి, చేవూరు శ్రీనివాసులు, దువ్వూరు వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరా పునరుద్ధరణ

చిట్టమూరు, జూన్ 7 ప్రభాతవార్త :

చిట్టమూరు మండలం బయ్యావారికండ్రిగ గ్రామంలో పైపులైన్ లీకేజి వల్ల తాగునీటి సరఫరా ఆగిన విషయం తెలిసిందే. అయితే గ్రామస్థుల సూచన మేరకు అరవపాలెం సర్పంచ్ రాజేష్‌రెడ్డి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి త్వరితగతిన తాగునీరు అందించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. అరవపాలెం పంచాయతీలో నిధుల లేమి ఉన్నప్పటికీ తరచూ దరకాస్తు, చింతలతోపు ప్రాంతాల్లో ఏర్పడిన తాగునీటి అవాంతరాలను అడ్డుకొని తన సొంత నిధులను వెచ్చించి బాగు చేయించారు. ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అయినా నిధులు కేటాయిస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందని పలువురు చెబుతున్నారు.

## నేడు విద్యుత్తుకు అంతరాయం

వెంకటగిరి, జూన్ 7 ప్రభాతవార్త :

పట్టణంలోని 132 కెవి సబ్ స్టేషన్‌లో రెండవ శనివారం మరమ్మతుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వెంకటగిరి టౌన్, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ ముని రవిచంద్ర నేడొక ప్రకటనలో తెలిపారు. రైతులు వినియోగదారులు సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# జీవో నెంబర్ 177ను రద్దు చేయాలి : కొమ్మోజు

గూడూరు, జూన్ 7 ప్రభాతవార్త :




గూడూరు పట్టణం పెన్షనర్ భవనంలో యుటిఎఫ్ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మధ్యంత కౌన్సిల్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు పాల్గొన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవో నెంబర్ 177 రద్దు చేయాలి, పూర్వ స్థితిని అనగా ప్రాథమిక పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలని పాఠశాలల విలీనం రద్దు చేయాలని కొత్త ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నవకోటి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్నటువంటి ఆర్థిక బిల్లులు వెంటనే చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు చదవ గలిగిన బోధనా మాధ్యం వారికి నచ్చిన విధంగా ఎంచుకునే సౌలభ్యం కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు అయినటువంటి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యలరెడ్డి మాట్లాడుతూ దాదాపు క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న విద్యా రంగం పైన ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని కోరారు. మెగా డీఎస్సి ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయుల యొక్క పెండింగ్ మెడికల్ బిల్లులు, ఉపాధ్యాయ సంక్షేమం వైపు కూడా కాస్త దృష్టి సారించవల్సిన అవసరం ఎంతైనా ఉంది అని ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ కోరారు. ఈ సందర్భంగా హాజరైనటువంటి తిరుపతి జిల్లాల 36 మండల శాఖల కార్యకర్తలు రాబోయే నూతన విద్యా సంవత్సరానికి కావాల్సిన సన్నద్ధత గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యుటిఎఫ్ నాయకులు సుధీర్ సింగ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల వెంటే ఆరణి సైన్యం : ఆరణి శివకుమార్ హామీ

తిరుపతి హెల్త్, జూన్ 7 ప్రభాతవార్త:
గత ఐదేళ్ల వైకాపా పాలనలో తిరుమల తిరుపతి దోపిడికి గురైందని, ప్రజలంతా మమేకమైతే జనసేన పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అండగా నిలబడి న్యాయం చేయడానికి నడుం బిగించారని ఆరణి శ్రీనివాసులు కుమారుడు శివకుమార్ తిరుపతి ప్రజలకు హామీ ఇచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు జనసేన పార్టీ తిరుపతి కార్పొరేటర్లు ఆర్‌సి మునికృష్ణ, అనిత, రేవతి, కల్పన, నారాయణ తదితరులతో కలిసి ఆరణి శివకుమార్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లకు సంబంధించిన టిడిఆర్ బాండ్లు




అందని వారికి న్యాయం చేస్తామన్నారు. తాము గత నాలుగు దశాబ్దాలుగా కాంట్రాక్టు వృత్తిలో ఉన్నామన్నారు. తిరుపతిలో కరకంబాడి రోడ్డు తదితర ఎన్నో రోడ్లను నిర్మించామన్నారు. ఈ నిర్మాణాల విషయంలో తమకు అనుభవం ఎక్కువ అన్నారు. వైకాపా పాలనలో వేసిన రోడ్లు అందులో కమిషన్ రూరంలో జరిగిన అవినీతి, వాటినంత కక్కించి ప్రజాధనానికి న్యాయం చేస్తామన్నారు. నిన్నటి వరకు ఒక ఎత్తు నేటి నుండి మరో ఎత్తు అని తెలియజేసారు. అవినీతికి గురైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని ఆరణి స్పష్టం చేశారు.

## యువకులు రాజకీయాల్లో రాణించాలి:ఎస్‌సివి

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



యువకులు రాజకీయాల్లో రాణించాలని పారదర్శక పాలనకు అవకాశం కల్పించాలని మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు అన్నారు. శుక్రవారం యువ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజకీయాల్లో రాణిస్తున్న సత్రవాడ ప్రవీణ్ ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో పానగల్‌లో కీలకంగా వ్యవహరించారు. పార్టీ విజయానికి కృషి చేసారు. ఆయన జన్మదినం సందర్భంగా పానగల్‌లో యువకులు సంబరాలు జరుపుకున్నారు. కాగా మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు సారథ్యంలో సంబరాలు ఏర్పాటు చేసారు. కేక్ కట్ చేసారు. శుభాకాంక్షలు తెలుపుతూ సత్కరించారు. ఆశీర్వదించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయంం వెనుక యువ నాయకుడు నారాలోకేష్ పాదయాత్ర ఎంతో ప్రభావం చూపిందన్నారు. అంతేకాక యువత ఆలోచనలు అభివృద్ధి దిశగా ఉంటున్నాయని వివరించారు. లోకేష్ సుమారు 4వేల కిలో మీటర్ల పాదయాత్ర చేసి యూత్‌ఐకాన్ అయ్యారన్నారు. ఆయనను స్ఫూర్తిగా యువత అడుగులేయాలన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎస్‌సివి దిలీప్‌నాయుడు, కిరణ్ హరినాయుడు, వినయ్, భాస్కర్ నాయుడు, నారాయణ యాదవ్, ధనంజయులు నాయుడు, ప్రభాకర్‌నాయుడు, సుదర్శనం నాయుడు, మునిశేఖర్ గౌడ్, చందూ, లీలామోహన్, ప్రకాష్‌నాయుడడు, ప్రసాద్‌నాయుడు, ఢిల్లి ప్రతాప్, సురేష్‌నాయుడు, రాజయ్యనాయుడు, మోహన్‌నాయుడు, చందు బాబు, ముత్తురెడ్డి, ఇర్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రాముని రాజ్యానికి ప్రజలు పట్టం కట్టారు : బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



రాముని రాజ్యానికే ప్రజలందరు పట్టం కట్టారని ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ అన్నారు. శుక్రవారం ఎన్నికల కోడ్ ముగియడంతో స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న దివంగత నేత తెలుగుదేశంపార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ , కరీంబాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్టపరిపాలన ఇంటికి సాగనంపి రాముడు రాజ్యానికి అంకితభావంతో ప్రతి ఒక్కరు ఓటు వేసిన ప్రతి తెలుగువారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాని తెలిపారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూడా గోపాలన్న పాలన మళ్ళీ వచ్చిందని ప్రజల కష్టాలను తీర్చడానికి తన తనయుడు ఎన్నడూ ప్రజలకు అందుబాటులో ఉంటాడని తెలిపారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, మాజీ మార్కెట్‌కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, కరీంబాయ్, వెంకటేష్‌చౌదరి, దారాపాండు, తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు పాలాభిషేకం చేసిన తెలుగుతమ్ముళ్ళు

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



రాష్ట్రంలో గడచిన ఐదు సంవత్సరాల కాలంలో అనేక అకృత్యాలకు పాల్పడుతూ సంక్షేమం కన్నా దోపిడీకే అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజల జీవితాలను నరక ప్రాయం చేసిన వైఎస్‌జగన్‌రెడ్డి పాలన అంతమైన సందర్భంగా స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి మైనార్టీ విభాగం తిరుపతి పార్లమెంటు ప్రధాన కార్యదర్శి షేక్ జిలానీ ఆధ్వర్యంలో తెలుగుతమ్ముళ్ళు పాలాభిషేకం చేసి శుద్దిచేశారు. కార్యక్రమంలో డాక్టర్ యం.ఉమేష్‌రావు, నెమళ్ళూరుబుజ్జి, ఉస్మాన్, చాంద్‌బాషా, శివ, భాస్కర్, మణి తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :
నేడు రెండోశనివారం సందర్భంగా ఉదయం 9.30గంటల నుంచి మద్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి 132 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 33 కెవి సబ్‌స్టేషన్ల నందు, 11కెవిలైన్లు మరియు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులు, నిర్వహణ నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఈఈ ఎన్.వాసురెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తి టౌన్, రూరల్, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, ఏర్పేడు మరియు కెవిబిపురం మండలాల పరిధిలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

## అల్లర్లకు పాల్పడిచే చర్యలు తప్పవు

తొట్టంబేడు, జూన్ 7 ప్రభాతవార్త :



ఎన్నికల లెక్కింపు అనంతరం కూడా చోటు చేసుకుంటున్న పరిణామాలలో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వర్గాల మద్య విభేధాలు, హింసాత్మక ఘటనలు జరిగిన విషయం సామాజిక మద్యమాల్లో, పత్రికల్లో అందరు చూసి ఉంటాని ఈనేపధ్యంలో శ్రీకాళహస్తి పట్టణం, రూరల్, బిఎన్‌కండ్రిగ, తొట్టంబేడు మండలాల పరిధిలో ఉన్నటువంటి ప్రజలందరు సంయమనం పాటించాలని డిఎస్పీ ఉమమహేశ్వరరెడ్డి తెలిపారు. ప్రశాంతంగా ఉండే ఈప్రాంతంలో తమ మాటల ద్వారా చర్యల ద్వారా అనవసరమైన అలజడి సృష్టించినట్లయితే అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు.

## మురళిని అభినందించిన లోకేష్

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో నాన్‌రెసిడెన్సి ఓటర్లను సమీకరించి వారిని తీసుకొచ్చి, వారిని చైతన్యపరచి ఓటింగ్‌లో పాల్గొనేటట్లు చొరవ చూపిన శ్రీకాళహస్తికి చెందిన కోటపాటి మురళిని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేష్ అభినందించారు. ఆయనను పార్టీ ప్రధాన కార్యాలయానికి రప్పించి అభినందించారు. ఎన్నికల సమయంలో పార్టీని విజయపథంలో నడిపించుటకు విజయానికి ఎందరో సొంత కార్యక్రమంలా పని చేసారని లోకేష్ అభినందించారు. ముఖ్యంగాకీలకమైన ఎన్నికల్లో ప్రతి పక్షం దాడులను ఎదుర్కొటంలో యువత చైతన్యంను లోకేష్ ఎంతో అభినందించారు. కోట పాట మురళి శ్రీకాళహస్తికి చెందిన వ్యక్తి. ఆయన ఆది నుంచి పార్టీలో ఉంటూ కార్యక్రమాలను నిర్వహించే వారు. పార్టీ ఆదేశాలను అమలు చేసేవారు. యువతను సమన్వయం చేయటంలో మురళి ముందుకు వెళ్లారు. మురళితో పాటు ఓ టీంగా ఏర్పడి కొందరు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లు పని చేసారు. ఆయా ప్రాంతాల్లో కోఆర్డినేటర్స్‌తో మురళికి సమన్వయం చేసారు. కొందరు ఓటర్లు బెంగుళూరు, హైదరాబాదులో ఉండగా వారిని సమీకరించి సమన్వయ పరచుకొని పోలింగ్ రోజు ఓటింగ్‌కు తీసుకురావటానికి కొందరు యువకులు బస్సులను స్పాన్సర్స్ చేసారు. ఈ విషయాలను మురళి యువ నాయకుడు నారాలోకేష్‌కు వివరించినట్లుతెలిసింది. ఈ సందర్భంగా నారాలోకేష్ మురళికి దిశ దెశ నిర్దేశం చేస్తూ యువత కృషి ప్లానింగ్‌తోనే నేడు మనం 175కి 164సీట్లు సాధించుకున్నాము. పార్టీ కోసం పని చేసిన వారి సేవల్ని పార్టీ నాయకత్వం మరువదని అలాగే సహకరించిన ఎంతో మంది నాన్ రెసిడెన్షియల్ ఓటర్లను ఆ రోజు రప్పించి వివిధ నియోజవర్గాల్లో ఓటింగ్ చేయించారు. తనను వెన్ను తట్టి ముందుకు నడిపిన పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, నారాలోకేష్, వేమూరి రవి, అరవింద్, బొజ్జల సుధీర్‌రెడ్డిలకు ధన్యవాదాలని మురళి తెలిపారు.

## నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారిని సాగనంపండి

**శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :** నామినేటెడ్ పదవుల్లో ఉన్న వారిని వెంటనే సాగనంపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారి చేసారు. శుక్రవారం సాయంత్రం ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. ఈ ఉత్తర్వులలో ఎవరైతే నామినేటెడ్ పదవుల్లో ఉన్నారో అందరి చేత రాజీనామాలు తీసుకోని సాగనంపండి అంటూ ఉత్తర్వులు జారి చేసారు. శ్రీకాళహస్తిలో నామినేటెడ్ పోస్టులు పొందిన మైనారిటి నాయకుడు సిరాజ్, ఎపిఆర్‌టిసి వైస్‌చైర్మెన్ మిద్దెల హరిలో వైయస్‌ఆర్‌సిపికి మెజారిటి రాలేదని తెలుస్తూనే నైతిక బాధ్యత వహించి రాజీనామాలు చేసారు. అయితే శ్రీకాళహస్తీశ్వరాలయం పాలకమండలిమాత్రం మరో ఏడాది పొగింపులో ఉంది. ధార్మిక సంస్థల పాలకమండళ్ళకు మినహాయింపు ఉంటుందని భావిస్తున్నారు. మరి వారు కోర్టుకు వెళ్ళె ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. మరి ఏమౌతుందో వేచి చూడాలి.

## ఏపి హంస చంద్రగిరి తాలూకా యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం

–అధ్యక్షుడుగా నందిపాటి గుణశేఖర్, కార్యదర్శిగా ఎన్.వాసుదేవ

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:




ఏపి హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటీవ్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్) చంద్రగిరి తాలూకా ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఏపి హంస ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రాజా తెలిపారు. స్థానిక ఆర్‌హెచ్‌టిసిలో శుక్రవారం చంద్రగిరి తాలూకా యూనిట్ సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాలూకా అధ్యక్షుడుగా నందిపాటి గుణశేఖర్, సెక్రటరీగా ఎన్.వాసుదేవ, తాలూకా ట్రెజరర్ నరేష్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్ వసంతకుమారి, ఆరగనైజింగ్ సెక్రటరీ తిరుపతి బాలాజీ, పబ్లిసిటీ సెక్రటరీగా పి.దినేష్ కుమార్, మహిళా వింగ్ సెక్రటరీ మాదవి, ఉపాధ్యక్షులుగా అయ్యప్ప, లావణ్య, జాయింట్ సెక్రటరీలుగా షెరీనా, గుర్రమ్మ, పద్మావతి, కె.అమరావతి, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ పుష్పలత, శివకుమారి, నాగసుధారాణి, ఎస్.జయంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. ఈ కార్యవర్గంలో నిజాయితీపరులను ఎన్నుకున్నట్లు తెలిపిన ఆయన ఉద్యోగుల డిమాండ్ల సాధనలో నిర్విరామంగా సేవలందించగలిగిన వారికే అవకాశం కల్పించినట్లు తెలిపారు. వైద్య సిబ్బంది సమస్యలను ప్రభుత్వం దృష్టికితీసుకెళ్ళి పరిష్కరించే దిశగా పనిచేయనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపి హంస జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఇమ్రాన్, ఏపి హంస ఎన్నికల అధికారి ఎస్.గీతరాణి, జిల్లా కార్యదర్శి టాటాబాయి, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి నైపుణ్య పోటీలో చంద్రగిరి విద్యార్ధి ప్రతిభ

–రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం, జాతీయ స్థాయిలో 4వ స్థానం

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



జాతీయ స్థాయి నైపుణ్య పోటీలలో చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల (పదిపాస్) విద్యార్ధి యశ్వంత్ తన అద్భుత ప్రతిభను కనబరిచినట్లు స్కూల్ హెచ్‌ఎం సి.విజయ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె వివరాలను వెల్లడించారు. పోస్టర్, చిహ్నాన్ని రూపొందించడంలో నిమగ్నమైన యశ్వంత్ ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌కు ఎంపికైనట్లు తెలిపారు. ఒకేషనల్ టీచర్ షేక్ రియాజ్ అలీ పర్యవేక్షణలో మెరుగైన ఫలితాలను అందుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎస్‌ఎస్‌ఏ, వృత్తి శిక్షణలో ఇండస్ ఎడ్యుట్రెన్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రోత్సహించినట్లు తెలిపారు. ఏప్రిల్ 28, 29, 30 రాష్ట్ర స్థాయిలో గుంటూరు, జాతీయ సాయిలో మే 15 నుండి 20 వరకు ఢిల్లీ జరిగిన పోటీలలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. ఇందులో రాష్ట్ర స్థాయి మొదటి స్థానం , జాతీయ స్థాయిలో 4వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. తమ విద్యార్థి ఈ ఘనతను సాధించడం పట్ల ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో యశ్వంత్ ప్రతిష్టాత్మకమైన ఈ పోటీలో తన భాగస్వామ్యాన్ని పరిగణలోకి తీసుకోవడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా తనకు ఈ అనుభవం ద్వారా లభించే అవకాశాల కోసం ఎదుచూసి అందిపుచ్చుకుంటానని అన్నారు.

## నారావారిపల్లి నాగాలమ్మకు పులివర్తి సుధారెడ్డి మ్రొక్కులు

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



సార్వత్రిక ఎన్నికలలో టిడిపి అభ్యర్ధి పులివర్తి నాని విజయం కోసం ముక్కోటి దేవతల ఆశీస్సులు కోరుకున్న పులివర్తి సుధారెడ్డి మహిళలతో కలసి మ్రొక్కులు తీర్చుకున్నారు. ఇందులో భాగంగా నారావారి పల్లిలోని నాగాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా భీమవరం, ఏ.రంగంపేట గ్రామాలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎన్నికలలో విజయం కోసం ముక్కోటి దేవతలకు మ్రొక్కుకున్నట్లు తెలిపారు. మ్రొక్కుకున్న ప్రతి దేవతకు మ్రొక్కులు తీర్చుకుంటానన్నారు. ఇంతటి భారీ విజయం మాలో గొప్ప బాధ్యతను పెంచిదన్నారు. మమ్మల్ని నమ్మి భారీ మెజారిటీని కల్పించారు. ప్రజల్లోనే వుంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఎంఎల్ఏ సతీమణిగా, మహిళగా మహిళలకు అండగా వుంటాననీ, పార్టీలకతీతంగా ఎక్కడ ఏ మహిళకు కష్టం వచ్చినా తన భర్త నాని రావడానికి ముందే తాను వస్తానని స్పష్టం చేశారు. ప్రచార సమయంలో ఇచ్చిన మాటను నిలుపుకుంటామని అన్నారు.

## ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం విద్యార్ధులకు అభినందనలు

–గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ప్రసన్నకుమార్

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



స్థానిక గ్రంథాలయంలో ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో ఏపి పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ప్రసన్న కుమార్ విద్యార్ధులకు అభినందనలు తెలిపారు. మే 15 నుండి జూన్ 7 వరకు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరంలో పాల్గొని వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్ధులకు ఆయన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ అధికారి రెడ్డెమ్మ, విద్యార్ధులు పాల్గొన్నారు.

## పోతురాజు ఊరేగింపు

ఏర్పేడు, జూన్ 7 ప్రభాతవార్త;



మండలంలోని పాతవీరాపురం గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత శ్రీధర్మరాజులస్వామి వారి 50వ వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు అయిన శుక్రవారం ఉదయం వేకువ జామున కలశపూజ, సుప్రభాత సేవ అనంతరం అంగరంగ వైభవోపేతంగా ధ్వజారోహణం నిర్వహించి, పోతురాజు విగ్ర హాన్ని మేళతాళాలతో మాధవమాల, గుండ్రాళ్లమిట్ట, మల్లవరం, ఇసుకతాగేలి గ్రామాలలో ఊరేగించారు. ఈసందర్భంగాఆయా గ్రామాల్లో కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తులు మ్రొక్కులు చెల్లించారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసి మునిరంగారెడ్డి, సర్పంచి మంజుల, మాజీ ఎంపీటీసి మునిరత్నంరెడ్డి, ఆలయ పూజారి కొంగర రవి, మునిరాంరెడ్డి, ఆదిమూలం, గురవయ్య, దొరస్వామి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సీతాలాంబ, రేణుక ఎల్లమ్మకు వార్షికోత్సవ పొంగళ్లు

ఏర్పేడు, జూన్ 7 ప్రభాతవార్త;
మండలంలోని కొత్తకండ్రిగ గ్రామంలో గ్రామ దేవతలైన శ్రీసీతాలాంబ, శ్రీరేణుకా ఎల్లమ్మ దేవతలకు శుక్రవారం వార్షికోత్సవ పొంగళ్లు అత్యంత వైభవంగా గ్రామస్థులు నిర్వహించారు. గ్రామంలోని మహిళలందరూ అమ్మవారికి అత్యంత భక్తి శ్రద్ధలతో పాలాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగ సమాఖ్య తిరుపతి జిల్లా అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు, గ్రామ ,పెద్దలు అర్జున్ నాయుడు, మునిరత్నం నాయుడు, సుబ్బయ్య యాదవ్, రామచంద్రనాయుడు, మునిరత్నంనాయుడు, గోవర్ధన్, హరీష్, అనిల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఎస్వీయూ విసి పై చర్యలు తీసుకోవాలి : తెలుగు యువత డిమాండ్

తిరుపతి హెల్త్, జూన్ 7 ప్రభాతవార్త




తిరుపతిలోని ఎస్‌వి యూనివర్శిటీలో గత ఐదు సంవత్సరాలుగా జరిగిన అక్రమ నియామకాలు, అక్రమ పదోన్నతులపై, నిధుల దుర్వినియోగం పై న్యాయ విచారణ జరిపించి అక్రమాలకు పాల్పడిన ఎస్వీయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం మీడియా ముందు తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధులు శేషాద్రి నాయుడు, రామ్మోహన్ తదితరు లతో కలిసి ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ ఈ అక్రమాలపై గవర్నర్‌కు లేఖ కూడా రాశామని తెలియజేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నో విద్యా మండళ్లలో జరిగిన అరాచకాలు, అవకతవకలపై విచారణ జరిపి వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టిడిపి అధినేతను కలిసిన ఎమ్మెల్యే కోనేటి

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, కాబోయే ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడుని సత్యవేడు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్ధిగా గెలుపొందిన కోనేటి ఆదిమూలం గురువారం సాయంత్రం మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం చంద్రబాబుని దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. టిడిపి తరపున ఎమ్మెల్యేగా గెలుపొంది, రెండవ సారి కూడా ఎమ్మెల్యేగా గెలపించి తనకు గుర్తింపు ఇచ్చి గెలపించడానికి కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, సూళ్లూరుపేట, గూడూరు. వెంకటగిరి ఎమ్మెల్యేలతో పాటు పారిశ్రామికవేత్త గంగవరపు రాంప్రసాద్ కూడా వున్నారు.

## తిరుచ్చి వాహనంపై పద్మావతీదేవి అమ్మవారు

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :



నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరుని ఆలయంలో శుక్రవారం భక్తుల సందడి అధికమైంది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం పాలు, పెరుగు, నెయ్యి వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనో హరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై అదిరోహించి ఊరేగించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారిని ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని టెంకాయ హారతులు, నైవేద్యం సమర్పించుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని నెయ్యి దీపాలను వెలిగించారు. టిటిడి అధికారులు భక్తులకు అమ్మవారి ప్రసాదాలను అందించారు.

## యువ నాయకులను సత్కరించి కోనేటి సుమన్

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :



మండలంలోని ఎరికంబట్టు, తిరువట్యం గ్రామాలకు చెందిన దళిత యువ నాయకులు గుజ్జేలి మహేష్, పెరుమాల్‌ను సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, చిత్తూరు ఉమ్మడి జిల్లాల జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్ శుక్రవారం దుశ్శాలువతో సత్కరించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్ధిగా సత్యవేడు నియోజకవర్గం నుంచి పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గెలుపు కోసం పని చేయడం పట్ల అభినందించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి తప్పక గుర్తింపు వుంటుందన్నారు.

## వైభవంగా గెరిగె ఊరేగింపు

పుత్తూరురూరల్, జూన్ 7 ప్రభాతవార్త:



పుత్తూరు మండల పరిధిలోని చిన్నబ్బ నాయుడు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత అంకాలపరమేశ్వరి అమ్మవారి తిరుణాల సందర్భంగా శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పుష్పాలతో అలంకరించి డప్పు వాయిద్యాల నడుమ ఏడు గ్రామాల్లో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గెరిగె అంకమ్మ దేవాలయానికి చేరుకుంది. అనంతరం అలుగు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణ వేపాకు తోరణాలతో సుందరంగా అలంకరించారు. భక్తులు అమ్మవారికి మంగళహారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

## సమస్యా పరిష్కారం అభివృద్ధే మా అజెండా : టీడీపీ

విజయపురం, జూన్ 7 ప్రభాతవార్త:
సమస్య పరిష్కారం అభివృద్ధే మా అజెండా అంటూ మండల టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన విజయపురంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో గాలి భానుప్రకాష్‌ను ఎమ్మెల్యేగా ఆదరించినందుకు కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. మండలంలో కొందరు గ్రావెల్‌పర్మిట్ తీసుకునఇ తరలించాలని వస్తున్నారని, అలాంటి కార్యకలాపాలు మండలంలో కుదరదని సూచించారు. పార్టీకి చెడ్డ పేరు తేవడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి అంశాలు చేయడానికి ఒప్పుకోమని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు, కొండూరు దాము, హరికృష్ణ, సమరసింహారెడ్డి, నాధముని తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి గెలుపుపై టెంకాయలతో తీర్చుకున్న మొక్కు

నారాయణవనం, జూన్ 7 ప్రభాతవార్త :



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ, సత్యవేడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్ధి కోనేటి ఆదిమూలం గెలుపొందడంతో నారాయణవనం మండలం తెలుగుదేశం పార్టీ తరపున స్థానిక దూండి వినాయకునికి శుక్రవారం సాయంత్రం 7గంటలకు 101 టెంకాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఎన్ భాస్కరన్, మాజీ ఎంపిపి పి గోవిందస్వామిలు మాట్లాడుతూ దుష్ట పాలనకు చమరగీతం పాడడంతో ఇకపై ప్రజలకు సుఖ శా ంతులతో కలిగిన పరిపాలన అందబోతున్న ఆనందాన్ని వ్యక్త పరిచారు. అంతకుముందు స్వామి వారికి టెంకాహారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కెఎస్ రవి, టి ఊరప్ప, మాణిక్యంరెడ్డి, అచ్చుకట్ల హరి, వేలురెడ్డి, బాలయ్య, ఆనందయ్య, శేఖర్, ఎస్ లోకయ్య, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

## రెండవ శనివారం విద్యుత్ మరమతులు

–ఉదయం 8 నుండి 1 గంట వరకు అంతరాయం

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:
విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యల పరిష్కారానికి రెండవ శనివారం మరమతులు చేపట్టనున్నట్లు శుక్రవారం ఏడిఈ శేషాద్రిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో మరమత్తులు, నిర్వహణ మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఉదయం 8 గటంల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ అంతరాయం పట్ల వినియోగదారులు సహకరించాలని కోరారు.

# పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఘన సన్మానం



పుత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త :

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నగరి నియోజక వర్గంలోని అయిదు మండలాల్లో పుత్తూరు మండలంలో తెలుగుదేశం పార్టీకి అత్యధిక మెజార్టీ సాధించిన విషయం తెలిసిందే. దీనిని పురస్కరించుకుని టిడిపి పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్‌లను శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీరిద్దరూ మాట్లాడుతూ పార్టీకి పుత్తూరులో అత్యధిక మెజార్టీ సాధించేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐటిడిపి రాష్ట్ర సమన్వయకర్త గాలి గోపినాథ్, రాష్ట్ర తెలుగు యువత మీడియా సమన్వయకర్త డి.జి.ధనపాల్, మునిసిపల్ మాజీ చైర్మన్ కరుణాకరన్, నాయకులు ప్రసాద్‌నాయుడు, ఈశ్వర్‌యాదవ్, ఉమాశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న రిషితారెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త



కనకాచలంపై వెలసిన మహిమాన్విత కనకదుర్గాదేవిని ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జలరిషితారెడ్డి కనకదుర్గాదేవిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకుని దర్శించుకుని ప్రత్యేక పూజులు నిర్వహించుకున్నారు. ఆమె వెంట రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం ఆస్తుల అక్రమణలు

### -నిద్రావస్థలో అధికారులు-కార్యాలయంలో ఆదాయాలే తప్ప రక్షణ ఎక్కడ?

శ్రీకాళహస్తి,జూన్ 7 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అధికారుల తీరు రోజు రోజుకు తీసికట్టుగా మారింది. ఇక్కడి ఆలయాధికారులు కార్యాలయంలో ఎసి గదుల్లో కూర్చొని ఈ రోజు ఆదాయాలెంత? వాటా ఎంత అని లెక్కించు కోవటం తప్ప శివయ్యకు సంబంధించిన ఆస్తుల పరిరక్షణ మాట మరచి పోయారు. కోట్లువెచ్చించి కైలాసగిరి చుట్టూ రోడ్లు వేయించటం తో చుట్టుపక్కల ఉన్న కొండకోనలు, గుట్టలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. చక్కటి సిమెంటు రోడ్డు వేయటంతో అక్రమణ దారులకు వరంగా మారింది. గతంలో విచ్చల విడిగా ఆక్రమణలు జరిగినా ఆలయాధికారులు తిరిగి చూడలేదు. ఇప్పటికి కూడా కోట్ల విలువ చేసిన భూములు ఆక్రమణలకు గురౌతున్నా నిద్రావస్థను వీడటం లేదు. ఈ నేపధ్యంలో ప్రస్తుతం గిరి ప్రదక్షిణకు సమీపంలో శ్రీకాళహస్తి పట్టణానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఎల్లప్ప గుంట ఉంది. దీనిని కొందరు రాజకీయ పలుకుబడితో ఆక్రమించుకుంటున్నారు.ఇది తొట్టంబేడు మండలం చిట్టత్తూరు పంచాయతీకి సంబంధించిందని తెలిసింది.ఆలయ ఆస్తుల్ని ఆక్రమణ దారుల నుంచికాపాడాల్సిన ఓ ధర్మకర్త తన డ్రైవర్ పేరుతో ఆక్రమణలకు పాల్పడుతున్నట్లు సమాచారం.అయితే ఈ అంశం సంబంధిత దేవస్థానం అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహారిస్తున్నారు.అయితే ఈ గుంటకు సమీపంలో గుగ్గుళ్ళవ్వ విగ్రహం, గిరిప్రదక్షిణలో అతిధి మండపం ఉన్నాయి. దేవస్థానం అస్తులు విచ్చల విడిగా ఆక్రమించుకుంటున్నా దేవస్థానం అధికారులకు తెలియటం లేదంటే ఎంత జవాబుదారి తనంతో పని చేస్తున్నారో అర్థమౌతుంది.

## బిజెపి కార్యాలయం వద్ద సంబరాలు

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సూచనలతో కొత్తపేటలోని బిజెపి కార్యాలయం వద్ద నేతలు సంబరాలు చేసుకున్నారు. దేశచరిత్రలోనే వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ ఎన్నికవ్వడంతో జిల్లా కార్యదర్శి, అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో బిజెపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు కలసి ఘనంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. నరేంద్రమోడీ దేశ చరిత్రలోనే మొట్టమొదటి సారి వరుసగా మూడో పర్యాయం భారతదేశానికి ప్రధానమంత్రి పీఠాన్ని అలంకరించనున్న సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాలను దేశంలోని అన్ని వర్గాల వారికి దేశ ప్రజలు ఎన్డీయే కూటమికి ఓట్లు వేసి నరేంద్రమోడీని దేశచరిత్రలో వరుసగా మూడోసారి ప్రధాన మంత్రిగా చేశారని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి మోర్చా సభ్యులు ఎస్వీరమణ, జిల్లా ఉపాధ్యక్షులు కొండేటిగోపాల్, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి ప్రజ్ఞశ్రీ, ప్రధాన కార్యదర్శులు కోనేటి అయ్యప్ప, పుణ్యండిల్లీకుమార్, వెంకటసుబ్బయ్య, కన్నావెంకటేశ్వర్లు, జివిఅమర్‌నాథ్‌లతో పాటు పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## మొక్కులు తీర్చుకున్న తెదేపా యువనాయకుడు

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



దివంగతనేత బొజ్జలగోపాలకృష్ణారెడ్డి తనయుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎంఎల్‌ఏగా గెలుపొందిన సందర్భంగా మొక్కు తీర్చుకోవడం కోసం శ్రీకాళహస్తి తెలుగు యువత నాయకుడు వంకాయల సిద్దులయ్య దంపతులు శుక్రవారం చిదంబరస్వామి, ఆకాశలింగం,అరుణాచలంలో అగ్నిలింగం దర్శనం చేసుకుని గిరిప్రదక్షణ చేసుకుని స్వామివారిని దర్శించుకుని మొక్కులుతీర్చుకున్నారు.

## మహిళావర్సిటీలో ఫౌండేషన్ డే కార్యక్రమం

తిరుపతి విద్య, జూన్ 7 ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంను స్థాపించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి పువ్వులు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ వలన మహిళా యూనివర్శిటీ యొక్క ఫౌండేషన్ డేని, వారి జన్మదినాన్ని సెలబ్రేట్ చేసుకోవడం కుదుర నందున ఎన్నికల నియమావళి పూర్తి అయిన సందర్భంగా యూనివర్శిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి. భారతి ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించి ఆయనను కొనియాడారు. మహిళల అభివృద్ధికి, అభ్యున్నతికి అనాటిలోనే ప్రత్యేకించి మహిళల కోసం ఒక విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం మహోన్నత వ్యక్తిత్వం. ఎంతో మంది విద్యార్థినిలు ఈ సంస్థ ద్వారా విద్యను అభ్యసించి దేశ విదేశాలలో వివిధ రంగాలలో స్థిరపడ్డారు. యూనివర్శిటీలో పని చేస్తున్నటువంటి టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్, ఇంతకు ముందు ఉన్నటువంటి అధికారులు వారి యొక్క కృషి వలన ఈ ప్రగతిని సాధించగలిగామని తెలిపారు. వివిధ దేశాలలోని సంస్థలతో అంతర్జాతీయ అవగాహన ఒప్పందాన్ని ఏర్పరచుకోవడం వలన విద్యార్థినిలకు ఇంటర్నేషనల్ ఎక్స్పోజర్ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జ్ రిజిస్టర్ గీత వాణి హాజరయ్యి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యూనివర్శిటీ ఇంకా ఇంకా అభివృద్ధి చెందలని అందరూ సమిష్టిగా కృషి చేసి నాక్ ఏ ప్లస్ సాధించాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ నాన్ టీచింగ్ స్టాఫ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పండ్ల తొక్కలతో బయో ఎంజైమ్ తయారీ

తిరుపతి, జూన్ 7ప్రభాతవార్త:




పండ్ల తొక్కలతో సాంప్రదాయబద్ధంగా ఇళ్ళల్లో శుభ్రత కోసం ఉపయోగించే బయోఎంజైమ్ తయారీపై తిరుపతిలో మహిళలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో మొదలైన ఈ శిక్షణా కార్యక్రమంలో మార్కెట్లో విక్రయిస్తున్న శుభ్రత రసాయన పదార్థాలు హానికరమైనవని, భూగర్భజలాలను, తాగునీటిని కలుషితం చేస్తున్నాయన్నారు. భూమిపై నివసిస్తున్న జీవరాశికి మానవాళికి ప్రమాదకరంగా మారిందన్నారు. దీంతో వీటిని గాకుండా బయో ఎంజైమ్‌లతో తయారుచేసే ద్రావణం వాడకంపై శుక్రవారం తిరుపతిలో శిక్షణ నిర్వహించారు. ఈ ద్రవాన్ని ఇంటిల్లిపాది వంటసామాగ్రి, ఇంటిని ,మరుగుదొడ్లను శుభ్రం చేసుకోవచ్చని అగ్రికల్చరల్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్లు కీర్తివెంకయ్య, హేమంత్‌కుమార్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఎల్‌ఐసి విశ్రాంత అధికారి శ్రీదేవి, ఎస్వీ ఆయుర్వేదిక కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ దత్తాత్రేయ, బిజెపి జిల్లా నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 7 ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్‌ను శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డిని కలసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు శ్రీకాళహస్తీశ్వరస్వామి తీర్థప్రసాదాలను అందించారు. ఓవైపు నారాలోకేష్ అత్యధిక మెజారిటీతో గెలిచినందుకు అభినందించడంతో పాటు, ఇటు నారాలోకేష్ సుధీర్‌రెడ్డిని అభినందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని లోకేష్‌ను కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పుత్తూరు, జూన్ 7 ప్రభాతవార్త :



రూరల్ మండలం పరిధిలోని చిన్నబ్బనాయుడు కండ్రిగ గ్రామంలో శనివారం ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలలో ఉచిత వైద్య శిబిరం జరిగింది. వాసన్ ఐ కేర్ ఆస్పత్రి, ఆపిల్ ఇంటర్నేషనల్ డెంటల్ కేర్ ఆస్పత్రి, హియర్ జాప్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు, సిబ్బంది శిబిరంలో సుమారు 250 మందికి పరీక్షలు నిర్వహించారు. కంటి ఆపరేషన్ కోసం 35 మందిని ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారికి ఉచితంగా శస్త్ర చికిత్స నిర్వహించి వారి స్వస్థలానికి చేరుస్తామని వైద్యులు తెలిపారు. స్థానిక టిడిపి నాయకుడు రమేష్‌నాయుడు సహకారంతో జరిగిన శిబిరాన్ని డాక్టర్ రవిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కోనేటి రవిరాజు, అధ్యక్షుడు బాబునాయుడు, కార్యదర్శి హెచ్.రామ్మోహన్ వర్మ, కోశాధికారి లోకనాథనాయుడు, సంయుక్త కార్యదర్శి రమేష్‌రాజు, ఎలెక్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావిళ్ల మాధవనాయుడు, పుత్తూరు కార్యదర్శి మునికృష్ణ, వైద్యులు డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ ప్రియాంక, పిఆర్‌ఒ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## విచ్చలవిడిగా గ్రావెల్ అనుమతులు

విజయపురం, జూన్ 7 ప్రభాతవార్త:

విజయపురం మండలంలో మైనింగ్ అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడాన్ని మండల టీడీపీ నాయకులు ఖండిస్తున్నారు. మండలంలోని మహారాజపురంలో సర్వేనెం.1 పేరిట మే నెల 16న జిల్లా మైనింగ్ అధికారులు అనుమతి ఇవ్వడాన్ని తరలించడానికి ప్రయత్నాలు చేయడాన్ని అడ్డుకున్నారు. సర్వే నెంబరులో సబ్ డివిజన్ లేకుండా అనుమతి ఇవ్వడం, తహసీల్దార్‌కు సమాచారం లేకుండా, స్కెచ్‌పై తహసీల్దార్ సంతకం లేకుండా ఉండే అనుమతులు చూపించడం సరికాదని ఆరోపిస్తున్నారు. పేదలకు పంపిణీ చేసిన భూములను సర్వే చేసి సబ్ డివిజన్ చేయలేదని, సర్వే నెంబరులో సబ్ డివిజన్ లేకుండా ఎక్కడ గ్రావెల్ మట్టి తరలించడానికి అనుమతిస్తారని ఆరోపించారు. గతంలో మంత్రి అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా గ్రావెల్ అనుమతులు మంజూరు చేశారని, వాటిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఇష్టానుసారం సంపాదించుకోవడంతో ఇప్పుడు ప్రయత్నాలు చేస్తున్నారని, ఎన్ని కల కోడ్‌లో ఎన్నికల పనుల్లో నిమగ్నమైన అధికారులు ఇలాంటి అనుమతులు ఎలా ఇస్తారని ధ్వజమెత్తారు. ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## శ్రీ మూలస్థాన ఎల్లమ్మ భక్తులకు అన్నదానం

చంద్రగిరి, జూన్ 7 ప్రభాతవార్త:



చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో శుక్రవారం నవయుగ కో ఆపరేటీవ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో అమ్మవారి భక్తులకు చంద్రగిరి అన్నదానం చేశారు. ప్రతి శుక్రవారం అమ్మవారి భక్తులకు దాతలు అన్నదానం జరిపిస్తున్నారు. ఇందులో భాగంగా పాతపేట, బజారువీధికి చెందిన నవయుగ కో ఆపరేటీవ్ సొసైటీ నిర్వహకులు భక్తులకు అన్నదానం జరిపించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఆకలి తీర్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖర్ రెడ్డి, ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి దాతలకు అమ్మవారి దర్శన ఏర్పాట్లు గావించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగదీష్ దంపతులు, ఓంకార్ భరధ్వాజ్, తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీపైనే...

### తొలి సంతకంతో నిరుద్యోగులకు ఆనందం
### -తిరుపతిలో తెలుగుయువత సంబరాలు

తిరుపతి,జూన్ 7ప్రభాతవార్త:



వైసిపి ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని విధాలుగా రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని, నిరుద్యోగులకు ఉపాధి,ఉద్యోగాలు లేక ఇబ్బందులు పెట్టారని తెలుగుయువత రాష్ట్రప్రధాన కార్యదర్శి ఎ.రవినాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు,యువత ఐదేళ్ళలో ఎన్నో కష్టాలు పడ్డారని, కేసులు భరించారని అయితే ఉద్యోగాలు లేకపోవడంతో జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. ఐదేళ్ళ వైసిపి పాలనకు, ముఖ్యమంత్రి జగన్ తీరుతో విసిగిపోయి బైబై వైసిపి అంటూ నినాదాలు చేసి ఓటుతో తరిమికొట్టారని అన్నాడు. రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేరోజు తొలిసంతకం మెగా డిఎస్సీపైనేనని రవినాయుడు ఉద్ఘాటించారు. దీనివల్ల 20లక్షల ఉద్యోగాలు నిరుద్యోగులకు వస్తాయన్నారు. రాష్ట్రానికి నూతన పరిశ్రమలు రానున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసంతకం మెగా డిఎస్సీపైన, అని రవితెలిపారు. తిరుపతిలోని ఎంఆర్‌పల్లి కూడలిలో తెలుగు యువత, టిఎన్ఎస్ఎఫ్ నేతలు రవినాయుడు, హేమంత్‌రాయల్, రంజిత్‌నాయుడు, కృష్ణయాదవ్, ఆర్‌పి శ్రీనివాసులు, తోటవాసు, గోపీ, లోకేష్‌రాయల్, జెడి ప్రసాద్, శ్రీరామ్‌బాబి, సాయివిష్ణు,శ్రీను, వెంకటేశ్‌యాదవ్ తదితరులు కేక్‌కట్‌చేసి చంద్రబాబు సిఎంతో రాష్ట్రంలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

## తిరుపతిలో కూటమి గెలుపుతో...

### సుగుణమ్మకు అభినందనలు





తిరుపతిలో కూటమి బలపరిచిన జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గెలుపులో సుగుణమ్మ కష్టం ఉందని టిడిపి నేతలు అభినందించారు. శుక్రవారం నగరపార్టీ నేతలు సన్మానించారు.

ప్రభాతవార్త-తిరుపతి

## పురోహితుల సమస్యలు పరిష్కరిస్తా

-నవీన్‌కుమార్‌రెడ్డి



టిటిడిలో తిరుమల కల్యాణ వేదికలో పనిచేస్తున్న పురోహితుల సమస్యలు పరిష్కరిస్తానని, దీనిపై త్వరలోనే ఏర్పాటు కానున్న టిటిడి బోర్డులో చర్చించి చొరవ తీసుకుంటానని బిజెపి నేత నవీన్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు.

ప్రభాతవార్త-తిరుపతి

# తిరుపతిలో ఎన్డీఏ కూటమి విజయోత్సవం



తిరుపతి కార్పొరేషన్, జూన్ 7 ప్రభాతవార్త :

తిరుపతి కొర్లగుంటలో జరిగిన ఎన్డీఏ కూటమి విజయోత్సవ సంబరాలకు స్థానిక నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి జేబీ శ్రీనివాస్‌లు ముఖ్య అతిధులుగా విచ్చేసారు. కేంద్రంలో రాష్ట్రంలో నరేంద్ర మోడీ, చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో విజయడంకా మోగించిన ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు, నాయకులకు, కార్యకర్తలకు ముఖ్యంగా దేశం కోసం ధర్మం కోసం అన్న నినాదంతో ప్రజలంతా ఏకతాటి పైకి వచ్చి ఓట్లు వేసి గెలిపించినందుకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ఎన్డీఏ కూటమి తిరుపతి నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, నవీన్ కుమార్‌రెడ్డి, జేబీ శీనులు కృతజ్ఞతలు తెలియజేసారు. తిరుపతి ఎమ్మెల్యేగా ఆరణి శ్రీనివాసులుని అఖండ మెజారిటీతో గెలిపించిన సందర్భాన్ని పురస్కరించుకుని కొర్లగుంటలో చుక్కా నారాయణ, మునికృష్ణ కేశవ గౌతం హేమంత్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలతో కలిసి కేక్ కట్ చేసి నరేంద్ర మోడీ చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్ధిల్లాలని స్థానికులంతా పెద్ద నినాదాలు చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. తిరుపతి పవిత్రతను ప్రశాంతతను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులుగా మన అందరిపై ఉన్నదని ప్రజలు స్వేచ్ఛగా జీవించేలా ఆధ్యాత్మిక నగరం మరింత అభివృద్ధి చెందేలా సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలియజేసారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మోహన్, వెంకట ముని, బాబు, నాదముని కుమార్, చంద్ర మధు భాస్కర్, లక్ష్మి, రోజా జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.